

# స్వామి నడక

అప్పాజోస్యుల —విష్ణుభోట్ల ఫౌండేషన్ (యుఎస్ఎ), ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక సంయుక్తంగా నిర్వహించిన దీపావళి కథల పోటీలో రూ. 1000/—ల బహుమతి పొందిన 5వ కథ

అది ఎల్లమ్మ కట్ట. పైపైకి పోకుండా కింద కిందనే శాఖోప శాఖలుగా విస్తరించిన ఆ వేపచెట్టు కింద ఆ ఉదయం బస్సుకోసం ఎదురు చూస్తూ నిలబడినాడు. మల్లయ్య. నలుగురైదుగురు ముసలి వాళ్లు కట్ట మీద చేరి చల్లగా తీరుబడిగా అప్పుడే మాటలు మొదలు పెట్టినారు. పసువులు మేపుకోసం కొండ దారి పట్టినయి. చెట్ల కింద, సగం సగం పడిపోయిన మట్టి గోడల కిందా పొడవాటి నీడలు నిశ్శబ్దంగా పరుచుకున్నాయి. పొద్దున ముద్దతిని ఎంగిలి కంచాలు చల్లిన ఇళ్ల ముందరి సందుల్లో కావుకావుమని అరుస్తూ కాకులు గెంతు తున్నాయి. చెట్ల మీద నుంచీ వీచే వేపపూత పరిమళం పరిసరాల్ని మత్తుగా ముంచెత్తుతూ ఉంది. ఆ వాతావరణమంతా మనసుకు ఏదోనిశ్చింతను కలగజేసే విధంగా ఉన్నా, మల్లయ్య మాత్రం స్థిమితంగా లేడు.

" పేటకు పోవల్లా? వద్దా?" అంటూ అతని మనసు ఇంకా అటూ ఇటూ ఊగుతూనే ఉంది. అతని చెవుల్లో ముసలి తండ్రి కేకలు గింగురు మంటున్నాయి.

" వారానికి మూడుసార్లు పేటకు పోకపోతేనేమీ?! అబ్బగంటూ తాతగంటూ వూడ్సు కుండావా, పేటలో? '

అన్నం తినకుండా మూడురోజులు ఉండగలడు కానీ పేటముఖం చూడకుండా రెండు రోజులు ఉండలేడు మల్లయ్య.

ఆపల్లెలోని నిశ్శబ్దాన్ని, ప్రశాంతతనీ దడ దడలాడిస్తూ వచ్చింది ప్రైవేటు బస్సు. బస్సు రాగానే మల్లయ్య మెదడును కుమ్మరి పురుగు తొలగడం మొదలు పెట్టింది.

పేటకు పోయి-
మ్యాట్నీ చూసొస్తే?
దుర్గా హోటల్లో దోశ తినొస్తే !
మట్కా నెంబరు కట్టొస్తే?
క్వార్టరు మందు కొడితే !...
ఎందుకు బాగుండదూ !
చల్ చల్ గుర్రం చలాకి గుర్రం
మనసు వద్దంటుందా !
గుర్రానికి కళ్లెం లేదు.

కానీ, అతని జేబుల్లోచాలినన్ని డబ్బుల్లేవు. డబ్బులోనే సుఖమంతా దట్టించబడి ఉంది. అప్పుచేసిపప్పుకూడు తినరా ఓ నరుడా. ఒకప్పుడు ఆపల్లెనుంచీ పట్నానికీ పదిమైళ్ళ దూరం.
బస్సు వచ్చిం తరువాత
ఆపల్లెనుంచీ పట్నానికి అరగంట మాత్రమే దూరం.దూరం కాలంలోకి కుదించుకు పోయింది. కాలానికి ఒక మెరుపు వేగం వచ్చింది. దూరాన్ని కాలం కొలుస్తుంది. కాలాన్ని డబ్బు కొలుస్తుంది. డబ్బు మనిషిని కొలుస్తుంది.
మనిషి ...... ?
కొలవబడతాడు, అంతే !

నాగరికతా వ్యామోహాల వెనుక ఈడ్చుకు పోబడతాడు, అంతే !
ఇక్కడ ఎవరి తప్పు ఏం లేదు.
మ్యాట్నీలు చూడమని థియేటర్లు బతిమాలవు.
మట్కా ఆడమని కంపెనీలు అడుక్కోవు.
బ్రాందీ తాగమని ఎవరూ గొంతు మీదకూచోరు.
ప్రజాస్వామ్యం లో బలవంతా లుండవు. విషాన్ని వాడుక చెయ్యడమే వ్యాపారం కిటుకు. మనిషి ప్రాథమికంగా ఇంద్రియ లంపటుడు.
నేటి సౌకర్యాలే రేపటి అవసరాలు.
ఒసే లచ్చుమూ ! పొద్దున్నే కాఫీలేకపోతే నాకు తలనొప్పి.

వదినా! వారాని కొకసినిమా అయినా చూడపోతే నాకు దిక్కుతెలీదు.

మూన్నాళ్ళ కొకసారి మందుకొట్టి మటన్ బిర్యానీ తినకపోతే ఈ బతుకెందుకు ! థూ! ఉప్పు లేని పప్పులాగ తయారైన బతుకులో

మట్కా నెంబరే మనిషి భవిష్యత్తు.
ఎక్కు ఎక్కు బస్సు ఎక్కు
చెయ్యి చెయ్యి అప్పు చెయ్యి.

పుల్లన్న మా తోటలోకి నీళ్ళు కట్టేదానికి రాలేదు; ఏడీ! ఇప్పుడే బస్సెక్కి పాయెనే! తిమ్మన్న మా చేనులోకి గుంటక పోసేదానికి రాలేదు. ఏడీ ఇప్పుడే బసెక్కి పాయనే! మునుపటి కాలం మాదిరి పనికి వంగరు కూలోళ్ళు. వ్యవసాయమంటే ఉరి పెట్టుకున్నట్టే రైతులకు.


పోకూడదనే యుద్ధ న్యాయాన్ని అతిక్రమించిన ఆధునిక యుగపు గుంపు స్వార్థం ఆపల్లెలోకి జొరబడింది బస్సువల్లనే!

మల్లయ్య ఆలోచనలనుంచీ తెప్పరిల్లి తనను తాను చూసుకొనేటప్పటికి బస్సులో ఉన్నాడు. అతనికి సీటు దొరకలేదు. పైన కమ్మీని పట్టుకుని నిలబడినాడు.

శుభమా అని ప్రొద్దున లేవగానే భార్య చెంపను ఛెళ్ళుమనిపించి, నాలుగు పిడి గుద్దులు గుద్ది వచ్చినాడు మల్లయ్య! ఆస్పర్శ చురుక్కుమంటూ. అతని చేతికింకా వేలాడుతూనే ఉన్నట్టుంది. అతనికి భార్యమీద చిరాగ్గా ఉంది. తండ్రిమీద కోపంగా ఉంది. 'ఇంత బతుకూ బతికి'..... ఈ ఆలోచనే అతని బుర్రలో సుడులు తిరుగుతూంది. అంత క్రితం ఇంట్లో జరిగిన విషయమే అతని బుర్రలోని ప్రతి ఆలోచననూ నడుపుతూ వస్తూంది. దినమూ అయిదు గంటలకల్లా నిద్ర లేచే మల్లయ్య ఆ దినం ఏడు గంటలు కావస్తున్నా దుప్పటి తీయలేదు. అతనికి మెలకువగానే ఉంది. కానీ దుప్పటి తీసి ప్రపంచంలోకి అడుగు పెట్టాలంటే ఏదో నిరుత్సాహంగా ఉంది. ఏదో పోగొట్టుకో బోతున్నట్లుంది. ఆరాత్రి పండుకోబోయే ముందు తండ్రి చెప్పిన మాట అతని మనసులో ముల్లై గుచ్చుకుంటూంది.-

రేపు చంద్రాయుడి తోటలోకి నువ్వుకూడా వస్తావని చెప్పినాను.'

'నేనా ? కూలికా? ఇంత బతుకూ బతికి..' అని రోషంతో మండి పోయినాడు మల్లయ్య. అంత



బస్సునుంచీ ది గే వాళ్ళలో చాలా మంది క్రితం రాత్రి పేటలోనే ఉండి వచ్చిన వాళ్ళు. వాళ్ల ఎక్కువమంది లేరు. ఆ ప్రయాణీకులు పూర్తిగా దిగిపోక ముందే వాళ్ళను ఒరుసు కుంటూ ఎక్కేవాళ్ళు మాత్రం రెండు బస్సులకు సరిపడేంత మంది ఉన్నారు. 'ముందు వాళ్ళను దిగనియ్యం డయ్యా' అని కండక్టరు ఒక వారనిలిచి చిల్లరలిస్తూ మొత్తు కుంటున్నాడు. డ్రైవరు రంకెలేస్తున్నా కొందరు అడ్డపంచలు పైకి ఎగగట్టి, డ్రైవరు డోరునుంచీ లోనికి దూరుతున్నారు. బస్సుపైకి ఎగబాకి కిటికీల్లోంచి టవళ్ళు సీట్లపైకి విసురుతున్నారు.

'అయ్యో చిన్నపాప ఊపిరాడదు'

'ముసల్దాన్ని తొక్కేస్తున్నార్రా'

'ఈమొగోల్లకు కండ్లు కనపడవు' ఎవరి సుఖం వాళ్ళది. ఎవరి స్వార్థంవాళ్ళది.

స్త్రీలూ, పసిపిల్లలూ, వృద్ధుల జోలికి

వరకూ మల్లయ్య ఒకరి కింద కూలి పని చేసి ఎరగడు. ఉన్నపది ఎకరాల్లోనే సేద్యం చేసుకుంటూ కడుపు కాలకుండా బతికినోడు. ముగ్గురు నలుగురు పై మనుషులు వచ్చినా వారికి అన్నం పెట్టగల స్తోమత గలవాడు. కానీ ఇప్పుడా పరిస్థితి లేదు. ఆర్థికంగా చితికిపోయినాడు. పొయ్యిలో పిల్లి లేవడమే కష్టంగా ఉంది. ఈ దు స్థితికి వానలు రాకుండా, పంటలు పండకుండా ఎగబెట్టడం ఒక కారణమే కావచ్చు. కానీ అది కొత్త సమస్యకాదు. ధరలు ఆకాశానికి అంటడం కూడా ఒక కారణమే కావచ్చు. కానీ అది కూడా కొత్త సమస్యకాదు. కొత్తకారణాలూ, కొత్త పరిస్థితులు, ఏవైతేనేం? కూలికి పోతే తప్ప సంసారం జరగని అవస్థ వచ్చింది మల్లయ్య.

మల్లయ్య ముసలి తల్లికూడా కూలికి పోవడం మొదలుపెట్టి నెల దినాలు దాటింది. ఈ నెల రోజుల నుంచీ అతడు కొడుకు మీద పడి చెవిలో ఇల్లు కట్టుకుని పోరుతున్నాడు.

పెండ్లయింది, ముగ్గురు పిల్లల తండ్రి వైనావు, ఇంకా ఎప్పుడురా నీకు సంసారంబాధ్యతలు తెలిసొచ్చేది.? వానలు లేవు. పంటలు పండవు, కూలికి పోతే తప్ప సంసారం జరగదు. నేనుకూలికి పోనని బిగదీసుకుంటే కడుపులోకి అన్నమెట్ల నాయనా?"

ఇంట్లో వాళ్ళు కూలికి పోయి ఇల్లు జరుపుతుంటే మల్లయ్య తప్పించుకుని తిరుగుతూన్నడు.


'ఏమన్నా మా వదిన కూలికి పోతూ ఉన్నట్లుందే' ? అని ఎవరైనా అడిగితే ఎంతో అవమానపడతాడు. కానీ అదేమీ ముఖంలో కన్పించ నివ్వకుండా-

'అదొక తిక్కది, చెప్తే వినదు ! ఇంటిదగ్గర గోళ్ళు గిల్లుకుంటూ కూర్చుంటే ఏమొస్తుంది? కూలికి పోతే పొద్దు అయినా పోతుంది కదా అంటుంది' అని తేలికగా నవ్వేస్తాడు'.

ఏరా? ఈ ముసలి ముప్పన మీ నాయన కూలికి పోయేది మొదలుపెట్టినాడు?" అని ఎవరన్నా అడిగితే "ఆయన ఒక బొబ్బాచారం మనిషి. ఈ వయసులో నీకెందుకు నాయనా ఇంత కష్టము. ఇంట్లో పెట్టింది తిని హాయిగా ఒకమూల కూర్చో అంటే నామాట వినదు" అని తండ్రిమీద ఎంతో చిరాకు ప్రదర్శిస్తూ ఉంటాడు.

'ఏం పాపా? అక్కమ్మా! ఈపొద్దు నీమొగుడు ముసుగు తియ్యడా ?' అని ముసలి తండ్రి తన కోడలి ద్వారా రెండు మూడుసార్లు హెచ్చరిక చేయడంతో ముసుగు తియ్యక తప్పలేదు మల్లయ్యకు. బైటికి పోయొచ్చి కాళ్ళూ మొగమూ కడిగినాడు. ముద్ద తిని లేచినాడు. అప్పటికే ముద్ద తిన్న ఆ ముసలి తండ్రి వక్కాకు నములూ్తా ఇంకా ఇంటిబైట అరుగుమీదే తిష్ఠవేసుకుని కూర్చున్నాడు.

'ఈపొద్దు నన్ను కూలికి ఎల్లబారిచ్చి గాని కదిలేటట్లు లేడు ఈయన' అనుకుని; ఇంత బతుకూ బతికి..... అని లోలోపలే ఉడుక్కున్నాడు మల్లయ్య. భార్య దగ్గరికి పోయి-'ఏమైనా దుడ్లున్నాయా?" అని గుస గుసగా అడిగినాడు.




'ఎందుకు' అక్కమ్మ ఇరకాటంలో పడినట్లుగా ముఖం పెట్టింది. ఇలాఎన్ని సార్లు తాను తన పెనిమిటికి డబ్బులిస్తూ ఉండాలో ఆమెకి అర్థంగాని సమస్య అయింది.

'ఎందుకైతే నీకెందుకు? నోరు మూసుకుని ఇచ్చేది నేర్చుకో'.

అక్కమ్మ నిశ్శబ్దంగా పోయి ట్రంకు పెట్టె అడుగునుంచీ పదిరూపాయల నోటు తీసిచ్చింది.

'ఇంతేనా ?' నిన్నవారం కూలిదుడ్లు ఏంచేస్తివి?' అని అడిగినాడు గుడ్లురిమి.

'మామకిస్తి' - అక్కమ్మ చెంప ఛెళ్ళుమనింది. ఆమె తన చెంపలపైనుంచీ కన్నీళ్ళు దొర్లిపోతుంటే

'పెండ్లాం దుడ్లు పీక్కొని పెండ్లాన్ని కొట్టేది కాదు మగతనం! కూలికిరా! నాతో పాటు కష్టం చెయ్యి. ఈ సంసారాన్ని సాకు. అప్పుడు కొట్టు; ఒప్పుకుంటాను. అంతేగానీ...' అని మాట్లాడ బోయింది.

ఆమె కూలిమాట ఎత్తగానే జుట్టు పట్టుకుని వంచి నాలుగు పిడిగుద్దులు గుద్దినాడు-'నువ్వు నాకు చెప్పేదానివా లంజా'!అంటూ.

లోపల కోడలి ఏడ్పువినిపించి అరుగుమీద కూర్చున్న ముసలయ్య మెల్లగా లేచినాడు. అంగీ తొడుక్కుంటూ బైటికి వస్తున్న కొడుకును-'యాటికి నాయనా ఎల్లబారినావు?' అని మెల్లగా అడిగినాడు. ఆ గొంతులో-నువ్వు ఎక్కడికి ఎల్లబారినావో నాకు తెలుసులే' అన్న వ్యంగ్యం ఉంది.

తండ్రి ఈ పక్కన ఉంటే ఆ పక్కకు ముఖం తిప్పుకుని-'పేటకు' అని జవాబిచ్చినాడుమల్లయ్య.

'ఏం? ఆపేటకు పోకపోతే ప్రాణముండదా? సచ్చిపోతావా?' కూలికి పొమ్మంటే పోయేదిలేదు! పోనీ ఇంట్లోనైనా ఊరికే తిని కూర్చుంటావా అంటే అదీలే!

'ఇంట్లోఆడోల్లూ, ముసలోల్లూ కూలికి పోయి సంసారం నడుపుతుంటే; నువ్వేమో పేటకు పోయేదీ. తినేదీ, తాగేదీ, అప్పులు చేసేదీ! ఆ అప్పులోల్లువచ్చి మామీద పడేది! మేం సంసారం జరుపుదుమా! లేక నువ్వు చేసిండే అప్పులు కడుదుమా!'

'అప్పులా? ఏది! ఎవని దగ్గర అప్పుచేసినావో పలికీ!' అన్నాడు మల్లయ్య.

ముసలయ్య గొంతు మరింత తీవ్రంగా మారిపోయింది.- 'ఎంత మందితో పలికియ్యల్ల చెప్పు ఆ మనుగల్ల ఒన్నూరు స్వామికి నువ్వు మూడునూర్లు బాకీలేవా? ఆదొడగొట్ల శ్రీనివాసులుకు నువ్వు అయిదు నూర్లు బాకీ లేవా? ఇంకా ఎంతమందితో పలికించల్ల; చెప్పు !'

మల్లయ్య వెంటనే ఒక అడుగు వెనక్కి వేసినాడు- 'సంసారం అన్న తరువాత అప్పులు అవుతయిమల్ల,' అని గొణిగినట్టుగా అన్నాడు.

'ఏందీ ఈసారి అను' -ముసలయ్య ముఖం కర్కశంగా మారిపోయింది. సంసారం కోసం అప్పులు చేసినావా?? ఎన్నడైనా ఇంట్లోకి బియ్యం తెచ్చినావా? ఇన్ని బేడలు తెచ్చినావా? ఉప్పు మిరపకాయలు తెచ్చేసినావా? ఇదిగో పట్టు అని నీచేత్తో ఏ అవసరానికైనా ఒక పదిరూపాయలు ఇచ్చినావా? చెప్పు నీ గుండెమీద చెయ్యేసుకుని చెప్పు. ఊరంతా అప్పులు చేసేదీ; ఆ పేటకు బస్సెక్కి పోయి జల్సా జల్సా చేసొచ్చేదీ! కూలికి పోడం వల్లంటే మళ్ళీ ఇతగానికి రోషం! మల్లయ్యకు నిజంగానే మళ్ళీ రోషం పొంగు కొచ్చింది. ఇంత బతుకూబతికి.. అని పండ్లు నూరుకున్నాడు. అట్లా అనుకోవడం వెనక మల్లయ్యకు ఒక అహంకారం ఉంది. అతడీ మధ్య తన ఊరి రాజకీయాల్లో బాగానే తల దూరుస్తున్నాడు. గ్రామసర్పంచ్ వెంకట నాయుడితో ఢీ అంటే ఢీ అనేటట్లున్నాడు. అందుకు మల్లయ్యకు అతని కులం గుంపు అండగా ఉంది.

ఆ ఊళ్ళో బోయోల్లకూ, కమ్మోల్లకూ మధ్యవైరం ఈనాటిది కాదు; ఇరవై ఏండ్ల క్రితం నాటిది. అప్పుడు మల్లయ్యకు పదేండ్లు కూడా లేవు. తన కులం మనిషొకడు కమ్మోల్ల కుక్కను రాయితో కొడితే అప్పటినుండి తగవు మొదలయ్యిందన్న విషయం అతనికి తెలుసు. ఆ తగవు అంతటితో ఆగిపోలేదు. అందరికీ మంచోడు అనంతయ్య

## 1996 దీపావళి కథల పోటీల్లో రూ.10,000/-ల బహుమతినందుకొన్న విజేత



'అంటు' కథా రచయిత : శ్రీ సన్నపురెడ్డి వెంకట రామిరెడ్డి జననం 1963లో కరవు సీమలో కనీసం పోస్టు డబ్బా కూడా లేని గ్రామం బాలరాజుపల్లె. వృత్తి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడు. 'తనకు లేని విద్యాగంధాన్ని నాలో చూసి తృప్తిపడేందుకూ, ప్రతిక్షణాన్ని శారీరక శ్రమతో పరిపుష్టం చేసిన మా నాన్న కృషి ఫలితమే జీవితాన్ని అధ్యయనం చేసేందుకు సహాయ పడింది. రచయిత నయ్యేందుకు ప్రేరేపించింది. నానాటికీ మృగ్యమైపోతున్న సజీవ మానవ సంబంధాల్ని గురించీ, నాగరికత పేరుతో సోమరితనాన్ని అంటించుకొనే యువ శ్వాసల్ని గురించీ, కలమతాల అంతరాల్ని పెంచుతోన్న కుహనా విజ్ఞానాన్ని గురించీ ఆవేదన చెందుతూ ఈ చీడపీడల ప్రాణ రహస్యాల కోసం పిచ్చిగా అన్వేషణ సాగిస్తోన్న దరలో పాతిక కథలు, పాతిక కవితలను మించి రాసినా ఇంకా ఏదో రాయాలనే తపనతో బతుకు సాగిస్తున్నాను'.అన్నారు 1994లో ఆంధ్రప్రభ దినపత్రిక దీపావళి కథల పోటీలో 'ఒక్కవానచాలు'కు ద్వితీయ బహుమతి లభించింది.

అన్నట్లుండే వెంకటనాయుడు సమయం రాగానే తన కులం వైపే చేరిపోయినాడు. బోయోల్లమీద కంటు కట్టినాడు. ఎరువులూ, సబ్సిడీ విత్తనాలూ మొదలైన ప్రభుత్వ సదుపాయాలేవీ వాళ్ళ వరకూ రాకుండా అడ్డుపడుతూ వచ్చినాడు.

రోడ్డు పని కంట్రాక్టూ, పంచాయితీ బిల్డింగు కంట్రాక్టూ మొదలైన కంట్రాక్టుల కోసం ప్రయత్నించి; వెంకట నాయుడి పరపతి ముందు భంగపడిన వ్యక్తిగత అనుభవాలు కూడా మల్లయ్యకు ఉన్నాయి.

'వీళ్లు మా బోయోల్లను బతకనియ్యరు. ప్రభుత్వం సొమ్ము తమ అబ్బగంట్లైనట్లు, అంతా తామే తినాలనుకుంటారు. మమ్మల్ని పైకి రానియ్యరు. అనుకుంటూ ఉంటాడు. కానీ నాయుడిని ఎదుర్కోవడానికి ఏం చేయాలో మల్లయ్యకు ఎప్పుడూ తెలిసింది కాదు. తన కులం గుంపును ఎలక్షన్లకే కాకుండా ఇతరత్రా ఏవిధంగా ఉపయోగించు కోవచ్చో అతనికి బోధపడింది కాదు. నాయుడికి పూర్తి ప్రతికూలంగా మారలేని అతని నిస్సహాయతే అతన్ని విషంలా కాల్చేస్తూంది. బైటపడే మార్గం లేక అతని కసీ, కోపం అతన్నే దహిస్తూ ఉన్నట్లుంది.

మరో వైపు తన వెనక తన కులమోల్లు నిలబడినారు అన్న స్పృహ అతనికి ఏదో కొత్త బలమిస్తూ ఉంది. తన ఊర్లో ఒక గుంపుకు నాయకున్ని అన్న ఆలోచన అతని మెదడుకు మత్తెక్కిస్తూ ఉంది. సర్పంచు గొడుగు కింద చేరితే తప్ప ఆ ఊర్లో ఉద్యోగాలు చెయ్యలేమనుకునే స్కూలు అయ్యవారి మీదా, అంగన్ వాడి టీచరు మీదా పిటీషన్ల మీద పిటీషన్లు పెట్టి వాళ్లకు తన ప్రాముఖ్యాన్ని తెలియజేస్తూ ఉంటాడు. ఆ పిటీషన్ల మీద వేలి ముద్రలు వేయడానికి అతని గుంపు ఎప్పుడూ సిద్ధంగా ఉంటుంది.

ఊరి రాజకీయాల్లో ఇంత ప్రముఖుడై పోతున్న తాను కూలికి పోయే స్థాయిలో లేడని ఈ పాతకాలపు ముసలి తండ్రికి ఎట్లా చెప్పేది? ఇంట్లో ఈగల మోతా బైట పల్లకీల మోత! ఛ ఛ!! — అని తండ్రిని ఈసడించుకున్నాడు మల్లయ్య.

..... ఒకవేళ చెప్పినా, కూటికీ కూరాకుకూ రాని రాజకీయాలు మనకు ఎందుకంటాడు. ఉత్త సత్తెకాలపు మనిషి! జానెడు పొట్ట గురించి రెక్కలు ముక్కలు చేసుకోవడం తప్ప వేరే ప్రపంచం తెలీదు ఈయనకి. కానీ తాను ఈయన మాదిరి చదువురాని దద్దమ్మ కాదు. ఏడవ తరగతి వరకూ చదివినవాడు. పెద్ద తరహాగా పేటకు తిరుగుతూ ఆఫీసుల్లోనూ, కోర్టుల్లోనూ వ్యవహారాలు నడపాల్సిన వాడే గానీ తండ్రి మాదిరి చేతులకు మట్టి పూసుకునేవాడు కాడు. కూలికి వంగేవాడు అసలే కాడు.

మల్లయ్య ఒకసారి తండ్రి వంక బిర్రుగా చూసినాడు-'నువ్వు తండ్రి వని ఇన్నాళ్లూ నీకు గౌరవమిచ్చినాను. ఈసారికి సరిపోయింది. ఇంకెప్పుడైనా నేను కూలికి పోయే మాట ఎత్తినా వంటే చూడు. మర్యాద దక్కదు.' అని చూపుడు వేలుతో హెచ్చరించి విసవిసా వచ్చేసినాడు.

మల్లయ్య తండ్రికి కొంచెం సేపు నోటి వెంట మాట రాలేదు. తన కొడుకు మల్లయ్యేనా ఇట్ల మాట్లాడేది అని అతనికేమీ పాలు పోలేదు.

బస్సు లేని కాలంలో తమ ఊరు ఎంత ప్రశాంతంగా, అమాయకంగా ఉండేదో, బస్సు వచ్చిన తరువాత తమ ఊర్లోకి మంచివీ, చెడ్డవీ ఎన్ని మార్పులొచ్చినాయో ఆ ముసలయ్యకు తెలియని విషయమేమీ కాదు. కానీ కొడుకు ధోరణి చూసిం తర్వాత అతనికి బస్సు వల్ల అన్నీ అనర్థాలే కన్పించేది మొదలుపెట్టినాయి.

'ఊరూరికీ బస్సు' అని గవర్నమెంటోల్లు బస్సు ఏసిరి. అప్పటి నుంచీ చుట్టుకుండే ఈ ఊరికి దరిద్రం. థూ...!' అని కొడుకు పోయే దిక్కుకు ఎంగిలి ఊసినాడు ఆ తండ్రి.

ఊరూరికీ బస్సులేని కాలంలో ఆ పల్లె ఒక చీకటి ద్వీపంలా ఉండేది. మనుషులు నెమ్మదిగా ఉండేవారు. తమ ఊరి పెద్ద ఏం చెబితే అది వినేవారూ చేసేవారూ. కలో గంజో తాగి బతికే వాళ్లు. వెంకటనాయుడు ఇంత అన్నంపెట్టి ఆకూ వక్క పేడూ ఇస్తే, కోటలాంటి అతని ఇంటికి సాయంత్రం లోపల సున్నం కొట్టి పోయేవాళ్లు. ఆ పాత సంగతులు తలచుకుని ప్రస్తుతం నాయుడు కుటుంబం వాళ్లే ఆశ్చర్య పోతుంటారు. అప్పుడు మనుషులు జానెడు పొట్ట గురించి తప్ప వేరే ఆలోచించే వాళ్లు కాదు. బుడ్డీ దీపం పెట్టే సమయానికి ఏ పొరుగూరి విశేషాలో, ఏ అద్భుత దయ్యాల కథలో చెప్పుకుంటూ నిద్రపోయేవారు. మహా అంటే సంవత్సరానికొకసారి పంటల కాలంలో రాత్రి బండి కట్టుకుని పేటకు పోయి: ఏ లవకుశో, పాండవ వనవాసమో సెకండ్ షో చూసి; మళ్లీ కోడి కూసేటప్పటికి ఇల్లు చేరేవారు. ఆ రోజు పుటలో ఎవరెవరు ఏ విధంగా తమ అజ్ఞానాన్నీ, అనాగరికతనీ బైట పెట్టుకున్నారో చెప్పుకుంటూ మళ్లీ సంవత్సరం వరకూ నవ్వుకుంటూనే ఉండేవారు. తక్కువ అవసరాల్తో బతకగలగడం అనాగరికత అయితే అప్పుడు వాళ్లు అనాగరికులే! వెంకటనాయుడి ఆధిపత్యాన్ని అంగీకరించడమే అప్పటి వారి శాంత జీవనానికి కారణం అనుకుంటే, అది కూడా నిజమే!

బస్సు కదలబోతుంటే మల్లయ్య ఒకసారి చుట్టూ కలియజూసినాడు. బస్సులో వెనక నిలబడిన అతని కులమోల్లు నలుగురు అతని వైపు చూసి గూఢంగా నవ్వినారు. బస్సులో జనం రకరకాలుగా ఉన్నారు.

హైస్కూళ్లకు పోయే పిల్లలున్నారు.

కాలేజీకి పోయే పిల్లలున్నారు.

మగపిల్లల్తో పాటు ఆడపిల్లలు కూడా పై చదువులకు పోతున్నారు.

కూరగాయలు గంపలకేసుకుని పేటలో అమ్ముకోవడానికి పోతున్న చిన్న వ్యాపారులున్నారు.

రెండు మూడు ఎనుగొడ్లని మేపుకుంటూ పాలు పిండి పేటలోని హోటళ్లకు అమ్ముకోబోయే పాల వ్యాపారస్తులున్నారు. ఆ పల్లెనుంచీ పేటకు బస్సు సౌకర్యం ఉంది కాబట్టి సరిపోయింది కానీ-లేక పోతే కరువు దెబ్బకు ఆ ఊరు ఊరంతా ఈ పాటికి ఖాళీ అయేది.

బస్సులో సర్పంచు చిన్న బావమరిదికి కూడా సీటు దొరకలేదు. అందుకు మల్లయ్యకు కొంచెం ఊరటగానే ఉంది. ఆ ఊరి బాపన సామికి కూడా సీటు దొరకలేదు. అతని ముందు మాదిగ కొల్లమ్మ నిలబడి ఉంది. బస్సు కదిలిన కుదుపులో కొల్లమ్మ వీపు తన ఛాతీకి తాకినప్పుడు బాపన సామికి ఎంతో బాగున్నట్లే అనిపిస్తూంది. భగ్గుమన్న కోర్కెలో 'మాదిగ మైల' భస్మమైంది.

అన్ని కులాల వాళ్లనీ ఏకంగా కట్టగట్టి భుజం మీద వేసుకుని తనపని తాను చేసుకుంటూ పోతూంది మోటారు యంత్రం! వందల సంవత్సరాల సామాజిక చరిత్రలో పదిమంది సంస్కర్తలు కలిసినా సాధించలేని పనిని ఒక యంత్రం అతి తేలిగ్గా చేసేస్తుంది. యంత్రానికి వ్యాపారంతో తప్ప కులభేదాల్తో నిమిత్తం ఉండదు.

ఊర్లో వెంకటనాయుడి తోట దగ్గర మలుపు తిరిగి పోబోతూ రక్కున ఆగిపోయింది బస్సు.

పెళ్లి నడకలు నడుస్తూ వచ్చినారు వెంకట నాయుడి ఇంటి ఆడవాళ్లు.

'లేవండి. లేవండి. ముందు సీటు ఖాళీ చెయ్యండి. నాయుడు వాళ్లు వచ్చినారు' అని ఆదుర్దాగా అరిచినాడు బస్సు కండక్టరు.

ముందు సీట్లో కూర్చున్నది ఆడవాళ్లు కాబట్టి, వారి వెనుక కూర్చున్న మగవాళ్లు సీటు ఖాళీ చేయవలసి వచ్చింది. నాయుడింటి ఆడవాళ్లు బస్సు సీటులో ఆసీనులు కాగానే రైట్‌రైట్ అనే కేకతో బస్సు కదిలింది. నాయుడింటి ఆడవారి దర్పాన్ని చూస్తుంటే మల్లయ్యకు మంటగా ఉంది.

'ఈ బస్సు నాయుడిదీ కాదు; నాయుడి అబ్బదీ కాదు. ప్రైవేటు బస్సు. తక్కువ కులమోల్లకు మాత్రం చార్జీలు తీసుకోరా! అటువంటప్పుడు నాయుడి కుటుంబం వస్తే మిగితా కులమోల్లు సీటు ఎందుకు ఖాళీ చెయ్యల్ల? అని రోషపడి పోయినాడు. ఆ సీటు ఖాళీ చేసింది మల్లయ్య కులం వాళ్లే!

'తనే ఆ సీట్లో ఉంటే నాయుడి వాళ్ల కోసం సీటు ఖాళీ చేసేవాడు కాదా? పోలీస్ స్టేషన్‌లో పలుకుబడి కలిగిన నాయుడికి ఎదురు తిరిగే శక్తీ, ధైర్యమూ తనకుందా? అని ఆలోచనరాగానే మల్లయ్యకు తన జీవితం మీద రోత పుట్టింది.

'థూ... దీనెమ్మ! ఈబతుకూ ఒక బతుకేనా?' అతని ముఖంలోని కండరాలు అసహ్యంతో కదలాడినాయి.

నాయుడు కుటుంబం వస్తే సీటు చూపించాలని కండక్టరు ఆదుర్దా పడటానికి మరో కారణం కూడా లేకపోలేదు.

మొదట ఆ గ్రామానికి గవర్నమెంటు వారే బస్సు నడిపినారు. అప్పుడు వెంకటనాయుడికి కూడా తన ఊరికి బస్సు పడటం మంచిదే కదా అనిపించింది. కానీ రాను రానూ తన ఊరికి బస్సు పడటం తన ప్రయోజనాలకు భంగకరమే గానీ లాభమేమీ లేదని అర్థమైంది.

భూమి లేని పేదలు, కూలికోసం తమ గ్రామంలోని రైతుల మీద మాత్రమే ఆధారపడే పరిస్థితి పోయింది. పదీ, ఇరవై కిలోమీటర్లయినా సరే; ఎక్కడ ఎక్కువ కూలి దొరికితే అక్కడికి బస్సెక్కి వెళ్లి వస్తున్నారు కూలీలు. దీని వల్ల ఆ పల్లెలో కూలీలకు డిమాండు ఏర్పడింది. కూలి రేట్లు పెరిగినాయి. మునుపు ఏడవ తరగతి పూర్తి చేసిన పిల్లలు హైస్కూలు చదివే అవకాశం లేక తమ చేన్లలోకీ, తోటల్లోకీ తక్కువ కూలికి పనికి వచ్చేవారు. కానీ ఇప్పుడూ! ఏడవ తరగతి పాసు కాగానే బస్సెక్కి పోయి హైస్కూళ్లలో చదువుతున్నారు. కాలేజీలకు పోయొస్తున్నారు. బస్సులేని రోజులనాటి మాట... టౌనులో ఉండి, అక్కడ తిండి ఖర్చులూ, బాడుగ రూము ఖర్చులూ భరించే ఆర్థిక స్తోమత కలిగిన వెంకటనాయుడు మాత్రమే ఆ గ్రామానికంతా యస్.యస్. యల్.సి. పూర్తి చేసిన మొట్టమొదటి వ్యక్తీ, ఏకైక వ్యక్తీ అయినాడు. కానీ ఆనాడు అతనికి దక్కిన ప్రత్యేక గౌరవం, డిగ్రీ పూర్తి చేసిన అతని కొడుక్కి దక్కలేదు. బస్సు పుణ్యమా అని డిగ్రీ చదువుకుని, పైగా పోస్ట్ గ్రాడ్యుయేషన్ కూడా చేసిన తక్కువ కులం వాళ్లు ఇప్పటికే తన గ్రామంలో ఇద్దరు ముగ్గురు ఉండటం వెంకటనాయుడికి కంటగింపుగా ఉంది. ఊరికి బస్సు పడిన తరువాత తమ కమ్మకులాలకు గల ఒక్కొక్క ప్రత్యేకతకూ కాలం చెల్లిపోతూ వచ్చింది.

ఊళ్లో తక్కువ కులాల పిల్లవాళ్లు తనముందే కొత్త కొత్త ఫాషన్లు అనుసరిస్తూ టక్ అప్‌లు చేసి తిరుగుతుంటే, వెంకటనాయుడికి చిరాకుగా ఉంది. తన ఇంట్లో వాళ్లు జనవరి ఫస్ట్ జరుపుకున్నంత కాలమూ అతనికి ఏదో దర్జాగా అన్పించింది కానీ, ఊర్లో అలగా జనం కూడా ఇళ్ల ముందు అలుక్కుని 'హ్యాపీ న్యూ ఇయర్' అంటూ ముగ్గులు వేసుకుంటూ ఉంటే అతనికి తన ఊరి సంప్రదాయం చెడి పోతున్నట్లుగా అన్పించింది. ఒక్క మాటలో చెప్పాలంటే బస్సు వచ్చిం తరువాత అతనికి తన పిడికిట్లోంచి తన ఊరి జనం జారిపోతున్నట్లుగా అన్పించింది.

ఇదంతా చూసీ, గమనించీ వెంకటనాయుడు ముడుచుకున్న చేతుల్ని విప్పదీసినాడు. గవర్నమెంటు బస్సు మీద దాడి ప్రారంభించినాడు.

తన ఊర్లో ఎవరు ఎక్కడ చెయ్యూపితే అక్కడ బస్సు నిలబెట్టాల్సిందే అన్నాడు. తన ఊరి వాళ్లు లగేజ్ వేసుకుంటే చూసీ చూడనట్టు వదిలేయాల్సిందే అన్నాడు. రోజా మూడు ట్రిప్పులు చాలవు; ఆరు ట్రిప్పులు తిప్పాలని పేచీ పెట్టినాడు. తమ షరతులకు ఒప్పుకుంటే సరి; లేకపోతే బస్సును తిరగనివ్వం అని మొండికేసినాడు. తమ కోసమే తమ సర్పంచు ఆర్‌టిసి వాళ్లతో ఈ యుద్ధమంతా చేస్తున్నాడని అనుకున్నారు ప్రజలు.

నాయుడి పోరు భరించలేక ఆర్‌టిసి వాళ్లు ఆ ఊరికి బస్సు తిప్పడం మానుకున్నారు. అప్పటికి గానీ, వెంకటనాయుడి ఎత్తు ప్రజలకు అర్థం కాలేదు.

బస్సు తీసెయ్యగానే ఇతర ఊళ్లకు కూలికి పోయే వారి కాళ్లు విరిచేసినట్టు అయింది. పేటకు పోయి, పాలూ, కూరగాయలూ అమ్ముకునే వారి రెక్కలు కత్తిరించినట్లయింది. హైస్కూలూ, కాలేజీ చదువులు అటకెక్కినాయి. పేటలో తాగుడూ, మట్కాజూదమూ అలవాటయిన వారి బాధ సరే సరి. బోయోల్లంతా ఒక గ్రూపుగా ఏర్పడినారు. వెంకటనాయుడి మనోభీష్టానికి వ్యతిరేకంగా ఒక అర్జీ రాసిచ్చి తమ ఊరికి మళ్లీ ఆర్‌టిసి బస్సు వేయించారు.

వెంకటనాయుడికి పరిస్థితి అర్థమైంది. ఈ బస్సును ఊరిలోకి అడుగు పెట్టనివ్వకూడదు. ఇది ఒకసారి అడుగు పెట్టింతరువాత ఆపడం ఎవరి తరమూ కాదు. తన రాజకీయం వల్ల కూడా కాదు. బస్సును ఆపలేనప్పుడు ఏం చేయల్ల? దాన్ని కూడా తన సొంత లాభంలోకి మార్చుకోవల్ల!


వెంకటనాయుడు అదే పని చేసినాడు. తనకు బాగా కావలసిన ప్రైవేటు బస్సుల ఓనర్ని కలిసినాడు. తమ గ్రామానికి బస్సు రూటు తీసుకొమ్మని ప్రేరేపించాడు. నీ బస్సు కలెక్షన్లకు నాది పూచీ అని చెప్పినాడు.

ఒక ప్రైవేటు డొక్కు బస్సు రంగంలోకి దిగింది. ఆర్‌టిసి కన్నా పావలా తక్కువ చార్జీతో తిరగడం మొదలు పెట్టింది. వెంకటనాయుడు మనుషుల్ని పెట్టి ఆర్‌టిసి బస్సు అద్దాల్ని బద్దలు కొట్టించినాడు. టైర్లు తీయించినాడు. దానితో గవర్నమెంటు బస్సు కాన్సిల్ అయింది. ఆ ఊరికి ప్రైవేటు బస్సు మాత్రం మిగిలింది. తమకు కావల్సింది బస్సు. అది ఏ బస్సు అయితేనేం? అనుకున్నారు ప్రజలు. ప్రైవేటు బస్సు కలెక్షన్లను బాగా పుంజుకుంది. ప్రస్తుతం వెంకటనాయుడికి బస్సు ఓనరు నుంచి ముడుపులు కూడా ముడుతున్నాయి.

కొండ దగ్గర మలుపు తిరిగి బస్సు తారు రోడ్డు ఎక్కగానే, పేట నుంచీ ఇండోసుజికీలో వస్తూ ఎదురైనాడు వెంకటనాయుడు. అతడు చెయ్యూపగానే బస్సాగింది. తన ఇంటి ఆడవాళ్లతో ఏదో మాట్లాడి వెళ్లి పోయినాడు. అతడు కన్పిస్తున్నంత సేపూ మల్లయ్య తన పెదాలు కొరుక్కుంటూనే ఉన్నాడు.

నలభై ఏళ్ల క్రితం- గ్రాం ఫోనూ, రేడియో;

**1996 దీపావళి కథల పోటీల్లో రూ.10,000/-ల బహుమతినందుకొన్న విజేత**



'వంజె' కథారచయిత : జొన్నవిత్తుల శ్రీరామచంద్ర మూర్తి. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం తాలూకా కోపల్లెలో ముప్పై రెండేళ్ల క్రితం, సాహితీ క్షేత్రంలో నిత్య కృషీవలుడైన బ్రహ్మశ్రీ జొన్నవిత్తుల రామకృష్ణ శర్మగారి నాలుగో సంతానం. ప్రస్తుతం ట్యూషన్లతో పాపిరెడ్డిపల్లెలో బతుకుతున్నారు. 'ఇంతవరకూ ఈ 'వంజె' వినా నేను సాధించిందంటూ ఏమీలేదు'.అంటారు. ఇది అచ్చుకొచ్చిన మూడో కథ. ఈ కథ అమ్మా నాన్నలైన బ్రహ్మశ్రీ .జొన్నవిత్తుల రామకృష్ణ శర్మ, మ.ల.స. జొన్నవిత్తుల లక్ష్మీ నరసమ్మ గారలకు- అంకితం.

**1996 దీపావళి కథల పోటీల్లో రూ.10,000/-ల బహుమతినందుకొన్న విజేత**



'మధుర' రచయిత్రి : కె. వరలక్ష్మి. జన్మించిందీ (1950), నివసిస్తున్నదీ తూర్పు గోదావరి జిల్లా జగ్గంపేటలో. మంచి సాహిత్యాన్ని చదవడం, మంచి సంగీతం వినడం, పసివాళ్లతో గడపడం ఇష్టమైన విషయాలు. పత్రికలలో 60 పైగా కథలు, 4 నవలికలు, కవితా ఖండికలూ ప్రచురింప బడినవి. 91, 93 'రంజని' పోటీల్లో ఎవార్డ్స్. ఈ మధ్యనే కథలు కొన్ని 'జీవరాగం' సంపుటంగా వచ్చాయి. తానెరిగిన సాహిత్య ప్రక్రియలన్నింట ఇష్టమైనది కథ. పల్లెలలోని స్త్రీల సమస్యలు, అడుగు వర్గాల జీవితాలు తొందరగా పట్టి కుదుపుతాయి తన్ను. కథ నేలను విడిచి సాము చెయ్యకూడదని తన నమ్మకం.

కపిలికి మారుగా నీళ్లను కొట్టే ఆయిల్ మిషనూ వగైరా ఆధునిక యంత్ర సామగ్రితో తన అమాయక పల్లె ప్రజల్ని మొదటగా ఆశ్చర్యపరచినాడు వెంకటనాయుడే! తన ఊరికి బస్సు లేని కాలం నుంచీ బుల్లెట్ బండిని మెయిన్‌టెయిన్ చేసి ప్రప్రథమంగా టౌను ప్రపంచంలోనికి దూసుకు పోయిన వాడూ అతడే! దాని ఫలితంగా టౌనులోని ఆఫీసుల్లోనూ, పోలీసు స్టేషన్‌లోనూ లావాదేవీలు కొనసాగించగల అవకాశమూ అతనికే కలిగింది. ఆ పలుకుబడిని ఎరగా వేసి, తన గ్రామ ప్రజల్ని గుప్పిట్లో పెట్టుకుని వారిపై దశాబ్దాలుగా రాజకీయాధికారం చలాయించగల వెసులుబాటు కూడా అతనికే అబ్బింది. అతడు ఎప్పుడు ఏ పార్టీలో ఉంటే, ఆ పార్టీకే అతని గ్రామంలోని ఓట్లన్నీ దాఖలు పడతాయని లెక్క. ఇందువల్ల రాజకీయ పార్టీల్లోనూ, రాజకీయ వర్గాల్లోనూ అతనికి తిరుగులేని ప్రాముఖ్యం వచ్చింది.

ప్రస్తుతం అతడెక్కిన ఇండో సుజికీని ప్రజలు అబ్బురంగా చూడటం లేదు. బస్సు పుణ్యానా గ్రామానికి గ్రామమే టౌను ప్రపంచానికి దగ్గరై పోతూ వస్తూ ఉంది. తన గ్రామస్థులు తెలివి మీరిపోతున్నారని వెంకటనాయుడు తెగబాధ పడిపోతుంటాడు గానీ, టౌను ప్రపంచం సంపర్కం వల్ల ఆ గ్రామంలో మొట్టమొదట తెలివి మీరిపోయిన వాడు అతడే!

పేట సమీపిస్తుండగా; బస్సు కిటికీలోంచీ బయటి దృశ్యాలు ప్రయా ణీకుల కళ్లకు ఢీకొడుతున్నాయి.

బీడు పడిన తోటల్లో దొంగలు పడి రాత్రికి రాత్రి ఇళ్లను తవ్వి తలుపులూ, కిటికీలూ పీక్కుపోయినందుకు సాక్ష్యంగా నిలబడిన మొండి గోడల శిథిలాలు కన్పిస్తున్నాయి. పేటలోని రౌడీలు ఆ మొండి గోడల మధ్య తాగి చీట్ల పేకలాడుతుంటారు. ఆ రోడ్డు మీద డబ్బు కోసం మొబైల్ బ్రోతలింగ్ జరుగుతుంటుంది. ఆ రోడ్డు పైడు అటవీ శాఖవారు నాటిన వైరు కంచెలో నెలకు ఒకటీ రెండూ గుర్తు తెలియని శవాలు ముక్కూ ముఖమూ చెక్కబడి అసహ్యంగా భీతిగొలుపుతూ కనిపిస్తుంటాయి. చీకటి పడిం తరువాత ఆ రోడ్లో నడవడమంటే దారి దోపిడీగాళ్ల మధ్య చావును కౌగలించుకోవడమే! పేటలో మల్లయ్య బస్సు దిగినాడు. ప్రయాణికులంతా బస్సు దిగుతుంటే ఎవరి కోసమూ ఎదురు చూడకుండా ఒక సందులోకి నడచి, అక్కడ ఒక చిన్న కొట్టం హోటల్‌లో కూర్చున్నాడు. బస్సులో వెనకాల నిలబడి అతని వైపు గూఢంగా చూసి నవ్విన అతని కులం వాళ్లు నలుగురూ కాస్సేపటికి అక్కడికి చేరుకున్నారు. అంతా కలిసి టీ తాగినారు. బీడీలూ సిగరెట్లూ కాల్చుకుంటూ మాట్లాడుతూ కూర్చున్నారు. వారి చర్చంతా స్టోరు డీలరు మీద ! స్టోరు డీలరుది ఈడిగ కులం. వెంకటనాయుడి మనిషి. అప్పటికే ఆ స్టోరు డీలరు మీద ఊర్లో పిటీషన్ రాయడమూ అయింది. తమ బోయ కులమోళ్లతో సంతకాలు పెట్టించడమూ అయింది. అంతా పోయి ఆ పిటీషన్ని డిప్యూటి తాహసీల్దార్‌కి ఇచ్చి వచ్చినారు. అక్కడి నుండీ మ్యాట్నీకి పోయినారు. ఇంటర్వెల్‌లో ఆకలవుతుంటే మిరపకాయ వడలు తిని టీ తాగినారు. మ్యాట్నీ వదలగానే మళ్లీ రోడ్డు మీద పడినారు.

అంతా బస్సు కోసం ఎదురు చూస్తూ నిలబడి ఉంటే, మల్లయ్యకు మందుకొట్టకుండా ఊరికి పోవాలనిపించడం లేదు. ముప్పై పారేసే చోట అరవై రూపాయలు పారేయల్లగానీ; మద్య నిషేధం వచ్చినా మందుకేం కొరత?

మల్లయ్య జేబుల్లో డబ్బుల్లేవు. తన ఊరి మనుషుల వైపు చూసినాడు. వాళ్ల ముఖాల్లో కూడా డబ్బు కళలేదు. ఆకలితో నకనకలాడిపోతూ, ఎప్పుడెప్పుడు కొంప చేరుకుని కడుపులోకి ఇంత మేత వేసుకుందామా అని ఆత్రంగా ఉన్నారు. మల్లయ్యకు కూడా ఆకలి కాకపోలేదు. కానీ ఆ ఆకలిలోని ఇచ్ఛాశక్తి అంతా మందు తాగాలనే కోర్కెలోకే రూపాంతరం చెంది, తాగుడు కోర్కెను మరింత విజృంభింపజేస్తూ ఉంది. అతని నోరు మందుకోసం పీక్కుపోతూ ఉంటే, ఏం చేయాలో దిక్కుతోచక బీడీ మీద బీడీ తాగుతూ నిలబడినాడు.

అతని పల్లెకు పోయే బస్సు ఎదురుగా వచ్చి ఆగింది. అదే చివరి ట్రిప్పు. ఆ బస్సు తప్పితే ఊరు చేరలేడు. కానీ మందు కొట్టకుండా బస్సెక్కలేడు.

బస్సెక్కి ఊరు చేరకుంటే ఆ రాత్రి పస్తు పడి ఉండాల్సిందే? బస్సులోకి డ్రైవరు కూడా వచ్చి కూర్చున్నాడు. ఏం? రావా ఊరికి? అని అడిగి వెళ్లి పోతున్నారు అతనితో వచ్చిన వాళ్లు.

ఎట్లా? ఎట్లా? ! బస్సు ఎక్కాలా? వద్దా?? అని తర్జనభర్జన పడుతున్నాడు.

రైట్, రైట్... కండక్టరు అరుస్తున్నాడు. బస్సు కదల బోయింది. కదలబోయే బస్సును ఆపమంటూ ఎవరో దబా దబా బాదుతున్నారు. హోల్డాన్, హోల్డాన్.. ఎందుకయ్యా బస్సును అట్ల బాదుతారు? అని మళ్లీ కిందికి దిగినాడు కండక్టరు.

'ఆడ మనిషి పాపం! బస్సును ఆపమంటూంది! '

'ఏదీ ? ఎక్కడ!'

'అదిగో ?అక్కడ'.

కాశీంపీరా బీడీ బంకులో కొల్లమ్మ మట్కా నెంబరు రాయిస్తూ, మరో వంక బస్సువైపు చూపు పెట్టి కేకలేస్తూ ఉంది-'ఓన్నా! కొంచెం బస్సాపు!'

'బిరింగ చెప్పమ్మా!ఏ నెంబరుకు' అని అడుగుతున్నాడు బీడీ బంకు కాశీం పీరా.

'మీ నెంబరెంతన్నా?'

'జీరో', తొమ్మిది '.

'ఇదిగో, జీరోకు నాలుగు. తొమ్మిదికి ఐదు. బ్రాకెట్టుకు ఒకటి. మొత్తం పది రూపాయలు. ఇదిగో అన్నా' అంటూ పది రూపాయలిచ్చి, మట్కా చీటీ తీసుకుని, భుజమ్మీద చినిగిపోయిన రవికతో, జారిపోతున్న పిల్లవాన్ని చంకలోకి ఎగేసుకుంటూ ఉరుకులూ పరుగుల్లో కొల్లమ్మ బస్సెక్కగానే రైట్ రైట్ అని అరిచినాడు కండక్టరు. బస్సు వెళ్లి పోయిం తరువాత మల్లయ్య మనసులో ఊగులాట ఆగిపోయింది.

'ఎట్లయినా సరే! ఈ పొద్దు మందు కొట్టల్ల. ఒక డెబ్బై రూపాయలు ఎట్ల దొరుకుతా యబ్బా!' అని ఆకలిగొన్న సింహం మాదిరి చూస్తున్నాడు, బజార్లో తిరుగాడే మనుషుల వైపు. అప్పటికి తమ అంగళ్లలో లైట్లు వేసుకుని చెంపలు అదర గొట్టుకుంటున్నారు వ్యాపారస్తులు.

మల్లయ్యకు ఎదురుగా బట్టల షాపు బట్టతల యజమాని కాష్ దగ్గర కూర్చుని కనిపిస్తున్నాడు. తినీ, తాగీ, సుఖపడకుండా డబ్బు కోసమే డబ్బు సంపాదించే వారి పట్ల అతనికి చెప్పరాని అసహ్యం కలుగుతూంది.

'ఎంతమందిని మోసం చేసి సంపాదిస్తున్నాడో ఆ బట్టతల నా కొడుకు! ఒకసారి ఈడ్చి డొక్కలోకి తంతే ముదరక పోతాడు. అప్పుడు ఆ బల్లా సొరుగులోంచీ ఒక అరవై డెబ్బై రూపాయలు ఎంచి జేబులో పెట్టుకుంటే ఎంత బాగుంటుంది? వెంటనే మల్లయ్యకు పోలీసులూ, చట్టాలూ,

కోర్టులూ, జైళ్లూ అన్నీ గుర్తుకొచ్చి ఏదో నిస్సత్తువ ఆవరించింది. కానీ అతని పూర్వీకులు ఈ రాజ్యవ్యవస్థకు అతీతంగా బతికిన రోజులు కూడా ఉన్నాయి.

చరిత్రను తవ్వుకుంటూ వెనక్కు పోతే మల్లయ్య పూర్వీకుల వృత్తి వేట! వేటలో తమ పూర్వీకులు ఎవరెవరు ఏవీ విధమైన శక్తియుక్తులు ప్రదర్శించేవారో ఇప్పటికీ ఆ కులం వాళ్ల కథలు కథలుగా చెప్పుకుంటూ ఉంటారు.

అడవి పందిని కొట్టాలంటే ధైర్యంకావల్ల. కుందేలును పట్టాలంటే చోరకళలోని ఒడుపు కావల్ల.

ప్రస్తుతం వేట వృత్తి పోయినా, వేట నుంచి సంక్రమించిన ఆ గుణాలు మాత్రం మల్లయ్య రక్తాన్ని పట్టుకుని ఇంకా వేలాడుతూనే ఉన్నాయి.

ఆరు వందల సంవత్సరాల క్రితం మల్లయ్య వంశీకులు ఇప్పటి మహారాష్ట్ర నుంచీ ఒక గుంపుగా తమ జీవన ప్రయాణాన్ని మొదలు పెట్టినారు. మార్గ మధ్యంలో మృగాల్ని వేటాడుతూ వచ్చినారు. మనుషుల్ని దోచుకుంటూ వచ్చినారు. వాళ్ల పాలేగాళ్లతో చేసిన యుద్ధాలకు సాక్ష్యంగా రాగి రేకులు దొరుకుతూనే ఉన్నాయి.

కాలక్రమంలో ప్రభుత్వాలు మారినాయి. వీళ్లకు అంతో ఇంతో భూమి ఏర్పడింది. ఆస్తిపాస్తులు ఏర్పడినాయి. ఈ విధంగా వీళ్ల సమాజంలో ఒక భాగమై పోయినప్పటికీ; కొత్త పరిణామంలో కొనసాగుతూ వచ్చే పాత లక్షణంలాగా వీరిలోని ఆటవిక జీవితపు విశృంఖలత్వం కొనసాగుతూనే వచ్చింది.


ఒక వైపు సామాజికులుగా ఉంటూనే మరో వైపు వేటాడే వాళ్లు. చిల్లర దొంగతనాలు చేసేవాళ్లు. బట్టీలు పెట్టి సారాయి వండుకుని తాగే వాళ్లు. మధ్య తరగతి నైతిక సూత్రాలకు ఎప్పుడూ ఒక సవాల్‌గానే జీవించినవాళ్లు!

సారాయి ఒక వంటకం. ఆ వంటకం తయారు చేసుకోవడానికి పూర్వం ప్రతి మనిషికీ హక్కుండేది. ఆ హక్కులోకి రాజ్యం ప్రవేశించడం ఇంగ్లీషు వాళ్లతో మొదలైంది. ఇంగ్లీషు వాళ్లు చూపిన దారిలోనే భారతప్రభుత్వం కూడా సారాయితో డబ్బు చేసుకోవడం మొదలు పెట్టింది. అప్పుడు సారాయిని స్వాంతంగా వండుకుని తాగితే తప్పయింది. అదే, గవర్నమెంటు కాచిన సారాయిని తాగితే ఒప్పయింది. ఆ విధంగా ప్రభుత్వం రూపొందించిన చట్టాలవల్ల సహజమైన సారా దొంగ సారా అయింది. తరతరాలనుంచీ దాన్ని తయారు చేసుకుని తాగే వాళ్లు హఠాత్తుగా దొంగలని పించుకోవలసి వచ్చింది. ఈ పరిస్థితుల్లోనే చట్టం నుంచి కాపాడుకోవడానికి బోయకులం వాళ్లు' స్థానికంగా పాలనాధికారం గల రెడ్లూ'చ కమ్మల గుప్పిట్లోకి వెళ్లి పోక తప్పింది కాదు.

ఎంత ప్రతికూలమైన పరిస్థితులకయినా నిలబడి తట్టుకోగలిగిన చేవ మల్లయ్య వంశానికుంది. చట్టాలూ, పోలీసులూ, కోర్టులూ, శిక్షలూ అన్నీ అణగదొక్క జూసినా వాళ్ల రక్తం ఇంకా ఏదో మూల ఇంకా తిరగబడుతూనే ఉంది.

ఏవో కొన్ని ప్రత్యేక కారణాలవల్ల మల్లయ్య తండ్రి లాంటి వాళ్లు మరీ మర్యాదస్థులు అయిపోయినా; మల్లయ్య వంశస్థులకు బోయకులంలోనే చారిత్రకంగా, సాంఘికంగా ఒక ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. వీరజాతిగా పేరుంది.

బోనులో చిక్కిన పులి మాదిరి మల్లయ్య ఇంకా ఆ బట్టల షాపు బట్టతల యజమాని వైపే ఆశగా చూస్తుండగా - అన్నా! అని పలకరించినాడు ఒక మనిషి. అక్కడి నుండి ముప్పై మైళ్లున్న నేత్రపల్లి అతని గ్రామం. అతని గడ్డం మాసి ఉంది. కొనలు సాగిన మీసాల్ని చివర్లో పురి తిప్పాడు. నలిగిపోయిన ఫుల్‌షర్టును మోచేతుల మీదికి మడిచినాడు. పెద్ద పంచను మడతలు పెట్టి అడ్డ పంచగా కట్టుకున్నాడు. చేతిలో వేట కొడవలుంది. నోరు గుప్పుమంటూ బ్రాందీ వాసన వేస్తూంది. ఆ నేత్రపల్లి మనిషిని చూడగానే మల్లయ్యకు ప్రాణం లేచి వచ్చింది. నేత్రపల్లిలో ఎద్దులు బేరానికి ఉన్నాయని తెలిసి చూసే దానికి పోయినప్పుడు మల్లయ్యకు ఆ మనిషి పరిచయం. ఆ తరువాత అడపాదడపా ఆ మనిషి బ్రాందీ షాపుల్లో కనిపిస్తూ ఉండేవాడు. సంవత్సరం కిందట బ్రాందీ షాపులో కొట్లాట జరిగినప్పుడు, నలుగురు




మనుషులు కలిసి ఈ నేత్రపల్లి మనిషిని కింద పడేసి తొక్కుతుంటే వారి మధ్యలో చొరబడి ఒక్కొక్కన్నీ చింతపండు పడేటట్లు కొట్టి అతన్ని కాపాడింది మల్లయ్యే.

'మందు కావల్రా అప్పయ్యా.'

'నువ్వు అడగాలే గానీ...' అంటూ జేబులోంచీ చప్పున హాఫ్ బాటిల్ ఓ.టి.తీసి చూపించి విజయ గర్వంతో నవ్వినాడు ఆ నేత్రపల్లి మనిషి. ఆ సీసాలో మందు ఇంకా సగానికి మిగులుంది.

మల్లయ్య గుండె జల్లుమంది. భయంతో దడదడా కొట్టుకుంది. 'పోలీసులు చూస్తార్రా!' అన్నాడు దిక్కులు చూస్తూ.

'వాళ్లూ మన వాళ్లేలేరా' అంటూ మందు సీసాను నింపాదిగా జేబులో పెట్టుకుని సోడా బండి దగ్గరికి దారి తీసినాడు నేత్రపల్లి మనిషి. అక్కడ ఒక గ్లాసు తీసుకుని మందుపోసి, సోడా కొట్టించి కలిపి-'నా కోటా అయిపోయిందిలే! నువ్వు తాగు' అన్నాడు.

'జతకి నువ్వూ కొంచం...' అనబోయి, పోలీసుల భయం వెంటా డుతుండగా గ్లాసెత్తి గటగటా తాగి మోచేత్తో మూతి తుడుచుకున్నాడు మల్లయ్య. సోడా బండి పిల్లోనికి గ్లాసు తిరిగి ఇచ్చేస్తూ గొంతులోంచీ శబ్దం వచ్చేటట్లు నోటితో పొడుగ్గా గాలి వదలినాడు. ప్రాణం తెరిపిన పడినట్లయింది. చెవులు వెచ్చబడినాయి. నరాలు జివ్వుమన్నాయి. నేత్రపల్లి మనిషి నుంచి సిగరెట్ అందుకుని దొమ్మల వరకూ పొగపీల్చి వదలినాడు. మందుమీద తాగిన సిగరెట్‌కు ఏదో కొత్త రుచి వచ్చినట్లుంది.

'అన్నా! ఇవిగో మిరపకాయ బజ్జీలు ! తిను.'

ఇద్దరూ పోయి షట్టర్లు దించిన షాపుల అరుగుమీద కూర్చొని, కాళ్లు కిందికి జార్చి మిరపకాయ బజ్జీలు కొరకడం ప్రారంభించినారు. మల్లయ్యకు నేత్రపల్లి మనిషి మీద ప్రేమ కట్టలు తెంచుకుంటూ ఉంది-

'లే! నువ్వు నా తమ్మునివిరా! నిన్ను ఎవరైనా తడుముకుంటే చెప్పు. ఉప్పు పాతరేస్తాను. నీకేం భయంలేదు!'

నేత్రపల్లి మనిషి పకపకా నవ్వినాడు-'అన్నా! నేనింకా సంవత్సరం కిందటి మనిషినే అనుకుంటు న్నావా!' మల్లయ్య ఎంతో అజ్ఞానంలో ఉన్నట్టు ప్రతిధ్వనించింది అతని నవ్వు. మిరపకాయ కొరకడం మాని అతని ముఖం వైపే చూస్తుండి పోయినాడు మల్లయ్య.

'నేనిప్పుడు రెడ్డి మనిషిని అన్నా! రెడ్డి మనిషిని'

నవ్వడరి ఆపి మల్లయ్య ముఖంలోకి గర్వంగా చూసినాడు నేత్రపల్లి మనిషి.

'ఆ పొద్దు కాదు; ఈ పొద్దు రమ్మను! ఎవడొస్తాడో? ఒక ఏటు ఇడిస్తే తలకాయ అట్లే తెగిపడల్ల;' అంటూ ఒకసారి వేటకొడవలి ఎత్తి చూసుకుని పండ్లు పటపట కొరికినాడు.

'అంతెందుకు? ఇప్పుడు ఈ బజార్లో చూసి చెప్పు. ఎవర్ని ఏసి రమ్మంటావు? పోనీ; ఆ బీడీ బంకోనితో యాభై ఇప్పించుకు రమ్మంటావా? ఆ హోటలోనితో నూరు గుంజుకు రమ్మంటావా? ఈ ఊర్లో ఎవడైనా సరే! మా రెడ్డి పేరు చెప్తే హడలై వడలు తినల్ల. ఇప్పుడు నేను రెడ్డి మనిషిని. మన కత్తికి ఎదురు లేదన్నా!' అని చెప్పుకొచ్చినాడు.

ఒకప్పుడు ఆ నేత్రపల్లి మనిషి పోలీసు కనిపిస్తే పళ్లికిలించుకుంటూ నమస్కారం చేసేవాడు. యం.డి.ఓ; యం.ఆర్.ఓ.లు గ్రామానికి వస్తే; తలపాగా ఊడదీసి చంకలో పెట్టుకుని భక్తి ప్రపత్తులతో మాట్లాడేవాడు. తాలూకా ఆఫీసుకు పోతే అటెండరుకు భయపడేవాడు. కరెంటు ఆఫీసుకు పోతే లైన్ మ్యాన్‌కు భయపడేవాడు.

కానీ లోకం పోకడ చూసినకొద్దీ ఒక కొత్త జ్ఞానం నేర్చుకున్నాడు.

రాజకీయ నాయకులు సొంత సైన్యాన్ని ఏర్పాటు చేసుకుంటున్నారు. ఆ కిరాయి గూండాల గుంపుతోనే ఎలక్షన్లలో రిగ్గింగ్ చేసుకుంటున్నారు. గవర్నమెంటు కంట్రాక్టులూ, టెండర్ల కోసం అదే ప్రైవేటు సైన్యాన్ని రంగంలోకి దింపుతున్నారు. ప్రభుత్వపు ఆస్తుల్ని యథేచ్ఛగా అనుభవిస్తున్నారు. లక్షలూ, కోట్లూ సంపాదిస్తున్నారు. అట్లాంటి రాజకీయ నాయకుల కింద ఒక నమ్మిన బంటుగా కుదురుకుంటే చాలు. ఇంక సమాజానికీ, ప్రభుత్వానికీ భయపడే పని లేదనీ, పైగా తనే సమాజం మీదా, ప్రభుత్వం మీదా అధికారం చలాయించవచ్చనీ ఆ నేత్రపల్లి మనిషి నేర్చుకున్న కొత్త జ్ఞానం!

'ఔనూ;నాకు తెలియక అడుగుతాను. నువ్వగినా మీ నాయుడి గ్రూపులో ఉన్నావా అన్నా!' అని మల్లయ్య చెవిలో నోరు పెట్టి గుసగుసగా అడిగినాడు ఆ నేత్రపల్లి మనిషి.

'ఆయనకూ మాకూ ఎప్పుడూ చుక్కెదురే!'

'అమ్మయ్య! బతికించావన్నా! లేకపోతే నువ్వూ నేనూ ఎక్స్‌పార్టీ అయిపోయే వాళ్లం.'

'అదేం మాట? ఎంతైనా ఇద్దరం సాటి కులస్థులం.'

'ఎక్స్‌పార్టీ అయినంక కులమూ గిలమూ 'జాన్తానై అన్నా' అంటున్న నేత్రపల్లి మనిషి మల్లయ్యకు వింతగానే కన్పించినాడు.

'ఇంతకూ ఊర్లో మన గుంపుకూ నాయునికీ ఎందుకు సరిపోదన్నా?'

మల్లయ్య వెంకటనాయుని కంట్రాక్టుల గురించీ, నక్క జిత్తుల గురించీ చెప్పుకొచ్చినాడు. బోయోల పట్ల అతనికి గల పూర్వపు వైరం గురించీ చెప్పుకొచ్చినాడు. ఒకటి రెండు సార్లు తన కులం వాళ్లని పోలీసు కేసుల్లో ఇరికించి ఏ విధంగా సతాయించి ఉండేది కూడా కథలు కథలుగా చెప్పుకొచ్చినాడు. 'అయినా నీకు తెలియందే ముందిరా అప్పయ్యా? ఈ రెడ్లూ, కమ్మోల్లూ మనం పైకి వస్తుంటే చూసి ఓర్చగలరా?' అని ముగించినాడు. ఆ చివరి మాటకు నేత్రపల్లి మనిషి ముఖం ఇబ్బందిగా పెట్టి మాట మార్చినాడు.

'మరైతే ఏం చేయదలచు కున్నావన్నా?'

'చేసేదేముంది అప్పయ్యా! నేను నాయునితో తూగ గలనా?'

'ఏందన్నా అట్ల మాట్లాడుతావు? బోయ పుట్టుక పుట్టి నాయుడి దెబ్బకి తోక ముడుస్తావా?'

ఆ మాటకి మల్లయ్యకి వెంటనే రోషమొచ్చింది.

'ఒరే? అప్పయ్యా! నువ్వు నేత్రపల్లి బోయోనివి అయితే నేను పులికంటి బోయోన్ని. గుర్తు పెట్టుకో!'

'అంత రోషముండే వానివే అయితే, మరిరా! మా రెడ్డి దగ్గరకు పోదాము.'

'పోయి...?' అని అడిగాడు మల్లయ్య అమాయకంగా.

'నీకు రాజకీయం తెలీదన్నా!' అని నవ్వినాడు నేత్రపల్లి మనిషి-

'మీ నాయునికీ మా రెడ్డికీ రాజకీయాల్లో పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుంది కదా?'

'అయితే?'

'నువ్వు మీ నాయున్ని దెబ్బ తీయాలంటే ఉత్త కులం బలం సరిపోదు. రాజకీయ బలం కూడా కావల్ల. అటువంటప్పుడు నువ్వు మా రెడ్డి పక్క చేరితే సులువు కదా!'

రెడ్డి పక్క చేరితే మాత్రం నాయున్ని ఎట్ల దెబ్బ కొడతానూ?

'అక్కడే ఉంది రాజకీయం' అని నవ్వినాడు నేత్రపల్లి మనిషి -

'ఈసారి చేపల చెరువుల వేలం పాటలో మీ నాయునికి మా రెడ్డి పోటీ వచ్చినాడనుకో! అప్పుడు చేపల చెరువు వేలం పాట నాయుడిది కాకుండా రెడ్డిది అవుతుంది కదా?'

'నిజమే!' మల్లయ్య ముఖంలో సంతోషం తొంగి చూసింది. నేత్రపల్లి మనిషి ఇంకా చెప్పుకొచ్చినాడు.

'నాయుడు నీకు ఊర్లో ఏ వేలం పాటనూ దక్కనీయకుండా చేస్తే, నువ్వు కూడా మీ నాయునికి ఏ వేలం పాటనూ దక్కనీయకుండా చేస్తావు. దెబ్బకు దెబ్బ! అప్పుడు తప్ప మన బోయోల్ల బలం నాయునికి అర్థం కాదు.'

'ఇంట్లో పరిస్థితులు బాగలేవురా అప్పయ్యా! ఆ సంగతి కూడా కొంచెం కొంచెం చూసుకోవల్ల కదా' అని తల గోక్కుంటూ నవ్వినాడు మల్లయ్య.

'నువ్వు ఉత్త అమాయకునివన్నా? మనం బతికే దానికి కాకపోతే ఈ రాజకీయమంతా ఇంకెందు కనుకున్నావు?' అని చెప్పుకొచ్చినాడు నేత్రపల్లి మనిషి -

'మీ ఊళ్లో చేపల చెరువు పాట రెడ్డిది అయితే, రెడ్డి తరపున ఆ చేపల చెరువు కాపలానీ, పనినీ తూగించుకోవలసింది నువ్వే కదా? అందుకని మా రెడ్డి నీకు చేపల చెరువులో భాగం ఇయ్యకుండా ఉంటాడా?'

'మీరు ఊరు బోయోల్లు! మేము అడవి బోయోల్లం! మీ తెలివి మాకు రమ్మన్నా రాదురా!' అని తన తెలివి తక్కువతనాన్ని ఒప్పుకోలేకుండా ఉండలేక పోయినాడు మల్లయ్య.

'పోదామా రెడ్డి దగ్గరికి?' అని లేచినాడు నేత్రపల్లి మనిషి.

రెడ్డి సొంత ఊరుకూడా ఆ పేట కాదు. పేటకు ఇరవై మైళ్ల దూరంలో ఓ గ్రామం. కానీ, రెడ్డికి పేటలో బంగళా ఉంది. సినిమా హాలుంది. ఇతర ఆస్తి పాస్తులున్నాయి. వేరే వ్యాపారాలు ఉన్నాయి. అన్నిటికీ మించి అతని రాజకీయ కార్యకలాపాలకు కేంద్రం ఆ పట్నమే! అతడు పట్నంలో ఉండి చుట్టు పక్కల పల్లెల్లో చక్రం తిప్పుతుంటాడు.

రెడ్డి దగ్గరకు పోవడమా? వద్దా? అన్న విషయాన్ని ఎటూ తేల్చుకోలేకుండా ఉన్నాడు మల్లయ్య. తన తండ్రి ఏమంటాడో? అని వెనుక ముందులాడుతూ కూర్చున్నాడు.

'నాయుడి కాళ్ల కింద అణగి మణగి పడి ఉండే తత్వం కాదన్నా నీది! నీ గురించి నీ కంటే నాకు బాగా తెలుసు. లెయ్. పోదాము. రెడ్డి దగ్గరికి!'

'నిజమే? చేపల చెరువులో కూడా వాటా దొరుకుతుంది. పైపైన ఉండి కింది మనుషుల్తో పని చేయించుకోవచ్చు. ఒకని కింద కూటికి పోయే హీనత్వం ఉండదు' అనుకున్నాడు మల్లయ్య.

'మనకెందుకు రాజకీయాలు అనుకో కూడదన్నా! మెత్తగా ఉన్నవాన్ని చూస్తే మొత్త బుద్ధి అవుతుందంట. కాబట్టి మనక్కూడా ఒక నాయకుడూ, ఒక రాజకీయ పార్టీ సపోర్టు ఉండల్ల. అప్పుడే మనమంటే పది మంది భయపడతారు. మనకు మర్యాదా, గౌరవం ఇస్తారు.'

'నిజమే! కానీ ఈ పోలీసులూ, జైళ్లూ...? నేను నాయుడితో తలపడగలనా అని? కొండతో ఢీ కొట్టడం అవుతుందేమోనే?'అని చింతచేస్తూ కూర్చున్నాడు మల్లయ్య.

అప్పుడే అటుగా వచ్చిన పోలీసు కానిస్టేబులు 'నమస్కారమన్నా!' అని నేత్రపల్లి మనిషికి ఒక నమస్కారం పెట్టినాడు. ఏదో గూఢంగా మాట్లాడి చివరికి - 'మమ్మల్ని మరచిపోయేవన్నా!' అని ఏదో అర్థయుక్తంగా నవ్వి వెళ్లి పోయినాడు. ఇది చూసి మల్లయ్య వెంటనే నిటారుగా అయిపోయినాడు.

చేతిలో బ్లేడు ఉంటే 'ఈ బ్లేడు నీకెందుకురా' అని డొక్కలోకి బూటు కాలితో తన్నగలిగిన పోలీసులే చేతిలో వేటకొడవలి పట్టుకు తిరిగే రెడ్డి మనిషికి వంగి సలాం చేస్తున్నారు.

మల్లయ్య మరొక్క మాట కూడా మాట్లాడ కుండా కట్టదిగి; రెడ్డి దగ్గరికి దారి తీసే నేత్రపల్లి మనిషిని అనుసరించినాడు.

ప్రస్తుతం మల్లయ్యకు తన యుద్ధరంగం ఎంతో విశాలమై పోయినట్టు అన్పించింది. తను బావిలోని కప్ప మాదిరి గ్రామానికి మాత్రమే పరిమితమైనంత వరకూ వెంకటనాయుడే బలవంతుడు. అతన్ని ఎదుర్కోవాలంటే, అతని మాదిరి తన రాజకీయం కూడా గ్రామం దాటి పట్టణానికి వీస్తరించక తప్పదు.

ఆ మరురోజు -

పల్లె నుంచీ పట్నానికీ, పట్నం నుంచీ పల్లెకీ ఒక కలగాపులగపు కొత్త రాజకీయ సంస్కృతిని విస్తరింప జేస్తున్న మాంత్రికసూత్రంలాగా మల్లయ్య గ్రామానికి పోయే బస్సు సిద్ధంగా ఉంది.

టీ పొట్లాలూ, పౌడర్ టిన్నులూ, సినిమా కాలెండర్లూ, సోపులూ... వగైరా వస్తువులు పట్టుకుని ప్రయాణీకులు బస్సెక్కుతుంటే, ఆ మారు మూల పల్లెకు నాగరికతను ఎగుమతి చేయబోతూ ఉన్నట్లుంది ఆ బస్సు! బస్సెక్కి కూర్చున్న మల్లయ్య చే సంచిలో రెండు మూడు చేతి బాంబులు కూడా ఆ పల్లెలోకి దిగుమతి కావడానికి నిశ్శబ్దంగా ఎదురు చూస్తున్నాయి.

●